# రాజగురువు
## (నాటిక)

★ శ్రీ కపిల కాశీపతిగారు

పాత్రలు :

[కళావతి, భట్టు, మంత్రి, కొత్వాలు, భేతాళుడు, వరూచి, విక్రమాదిత్యుడు, మహారాణి.]

స్థలం :

ఉజ్జయినిలో విక్రమాదిత్యుడి రాజభవనం.

అంతఃపురంలో సింహద్వారసీమ.

(కళావతి పూలసెజ్జతో ప్రవేశిస్తుంది)

కళా : ఎవరమ్మా, తలుపుదగ్గరా, ఝాం పొద్దెక్కినా రాజ ద్వారాలు తెరవకుండా వున్నారు... పలకనన్నా పలక రేం.

భట్టు : (సోమూలనించి ప్రవేశిస్తాడు).

పలుకమన్న పలుకవూ
పంచదారచిలకవూ
నీదురూపుజూపవూ
నిండవెన్నెల బాపవూ

కళా : అంతఃపురంలోకి నువెల్లా వొచ్చావ్. ఎవరన్నా చూస్తే బాగుండదు వెళ్లిపో. అంతఃపురం... ఇక్కడ నీ అధికారం లేదు.

భట్టు : అధికారంకోసం రాలేదు. మమకారంవల్ల వొచ్చాను.

కళా : ఏదీ కాని వేళ నేదీనిందిట... తలుపులు తియ్యలేదేం?

భట్టు : ఈ వేళే కాదు. వారంరోజులైంది, ఆ తలుపులు తెరచి. నీకు తెలియదు గావును కోటంతా గోలగా వుంది. మహారాజు బయటికి రావడం లేదు.

కళా : ఎవరది. ప్రధానమంత్రి ఇల్లా వొస్తున్నారు.

భట్టు : మహాప్రభూ దణ్ణాలండి.

మంత్రి : మహారాజు లేచారా ? తలుపు తియ్యమను.

భట్టు : ఎవరులోపల ? ప్రధానమంత్రులవారు మహారాజు దర్శనంకోసం వొచ్చారు, తలుపుతియ్యండి.

లోపల్నించి : వీల్లేదు.

మంత్రి : ఎందుకని.



లోపల్నించి : రాజాజ్ఞ.

మంత్రి : ఏమిటీవిడ్డూరం ? (ప్రవేశం కొత్వాలు)

కొత్వా : మహామంత్రులికి నమస్కారం.

మంత్రి : శ్రీ కృష్ణార్పణం. కొత్వాలుగారు పనివీూద దయ చేశారు.

కొత్వా : మహారాజు దర్శనంకోసం, తమదర్శనంకోసం.

మంత్రి : విశేషం?

కొత్వా : తమకు తెలియనివి వుంటాయా ? మహారాజు మామూలుప్రకారం, రాత్రులు ప్రచ్ఛన్నవేషంలో నగర సంచారానికి రావడంలేదు. నేనొక్కణ్ణే తిరుగుతున్నాను. వీలైతే వారితోగాని, లేకపోతే రాజసభలోగాని కొన్ని విషయాలు మనవిజేసుకుందామని.

మంత్రి : నగరంలో సోహత్య జరిగిందని విన్నాను, ఆచోకీ తీశారా.

కొత్వా : అధికార్లు అడిగారు గనక మనవిజేస్తాను. హత్య విషయం అలజడిగానేవుంది. స్త్రీకోసం జరిగిన హత్య ఆచోకీ కష్టం మహాప్రభూ. జనబాహుళ్యం కట్టు తప్పకుండా వున్నన్నాళ్లు పరిపాలకుల కార్యాలు సులువుగాని, ప్రజల మనోవృత్తిమారి, బరితెగితే పట్టడం పరమేశ్వరుడికైనా దుర్లభం అన్న సంగతి మహామంత్రునికి తెలియందికాదు.

మంత్రి : రాజనీతి తర్కించడం కాదు. మన కర్తవ్యం, పాలించడం.

కొత్వా : ఆ సంగతే, మహాశయా మనవిజేసుకున్నాను. ప్రజలంతా ప్రస్తుతం మహారాజు నీతి తర్కిస్తున్నారు. కంచే చేనుమేస్తే కాపలా ఎవరు ?

మంత్రి : మనం రాజగురువు వరూచి మహాశయుల దర్శనం చేసి, కర్తవ్యం ఆలోచిద్దాం. (వెళ్లిపోతారు)

కళా : వ్యవహారం చాలా తీవ్రంగావుందే. మహారాజు ఎందుకు బయటికి రావడం లేదు ?

భట్టు : నా అవస్థలోనే మహారాజూవున్నాడు.



http://www.maganti.org/

కళా : అనగా.

భట్టు : అనగా, అనగా వో రాజు. ఆ రాజు ఉద్యానవనంలో వో వనమాలి. ఆతని భార్య చక్కని చుక్క. రోజూ అంతఃపురంలోకి పువ్వులుపట్టికెళ్లుతోంటే మహారాజు మోజుపడి మోహించాడు. అదీ చిక్కు. మరి, నేను......ఏమంటావు ?

కళా : నోరు మూసుకోమంటాను !

భట్టు : ఊరికే అన్నానుగాని, నువ్వు పతివ్రతవని నాకు తెలియదూ.

చిల్కూల్ చిటారిగా పల్కూల్ పటారిగా
మనవాడలకు బంగారు బొమ్మొచ్చేనే
మనవాడలకు బంగారు బొమ్మొచ్చేనే

కళా: చిన్నపూలుచేబట్టి. చినమాయినగరెడితె
చిన్నరాజు కన్నెసెనే, చినరాజు కన్నెసెనే.

భట్టు: చిల్కూల్‌చిటారిగా పల్కూల్‌పటారిగా
చిల్కూల్‌చిటారిగా పల్కూల్‌పటారిగా
మనవాడలకు బంగారు బొమ్మొచ్చెనే
మనవాడలకు బంగారు బొమ్మొచ్చెనే.

కళా: పెద్దపూలుచేబట్టి పెదమాయినగరెడితె
పెదరాజుకన్నెసెనే, పెదరాజుకన్నెసెనే.

భట్టు: చిల్కూల్‌చిటారిగా, పల్కూల్‌పటారిగా
మన వాడలకు బంగారు బొమ్మొచ్చెనే.

(తలుపులు అటూ ఇటూ తోసిన చప్పుడు.
కలకలం. భేతాళుడు ప్రవేశం.)

భేతా: వత్సా ! వత్సా ! ఎవడురా అక్కడా, మహారాజేడీ.

భట్టు : మహాప్రభో రక్షించాలి, మేం ఎరగమండి.

భేతా : నువ్విక్కడేం చేస్తున్నావ్ ? రాజద్వారం తలుపు తియ్యమనవే నువ్వు.

కళా : ఎవరమ్మా లోపల, తలుపు తియ్యండి. ఎవరమ్మా తలుపు.

లోపల్నించి : తియ్యడానికి వీల్లేదు.

భేతా : ఎవరది, తియ్యి. తలుపు తియ్యి.

లోప : వీల్లేదు.

భేతా : కారణం ?

లోప : రాజాజ్ఞ.

భేతా : తీస్తావా, ఒక్కతాపుతో తలుపులు పగలగొట్టమన్నావా ?

లోప : రాజాజ్ఞ.

భేతా : ఏమిటీ కండకావరం ? వత్సా ! వత్సా ! ఎక్కడున్నావ్ ?

భట్టు : రాజ గురుభ్యా, ప్రధాన మంత్రీ దయచేస్తున్నారు.

(వరూచీ, మంత్రీ ప్రవేశం)

వరూచి : భేతాళ మహాశయులు ఉదయమే కోటకు దయచేశారు, కారణం ?

భే : మీ శిష్యుడే.

వరూ : తమకోసం అంపించారా ?

భే : లేదు నేనే వొచ్చాను. విక్రమాదిత్యుడు వాహ్యాళి, వ్యాయామం, యోగాభ్యాసం మానేశాడు.

వ : కారణం ?

భే : ప్రణయం.

వ : మహారాణి నగరంలో లేదా ?

భే : వరూచి మహాశయా, తెలిసి అడుగుతున్నారా, తెలియక అడుగుతున్నారా. రాజాంతఃపురంలో, నగరిలో, నాడులో నానాగగ్గోలుగావున్న మహారాజ విరహం మీకు తెలియదనుకోవాలా ?

వ : అసలు తమ ఆగ్రహానికి కారణం.

భే : మహారాజు చంద్రబింబంకోసం పరితపిస్తున్నాడు.

వ : శ్రీరామచంద్రుడుకూడా చిన్నప్పుడల్లాగే చేశాడు.

భే : శ్రీరాముడు, ఏకపత్నీ వ్రతుడు.

వ : విక్రమాదిత్యుడు కాడా ?

భే : రాజోపవనంలో నూతనంగా వెలిసిన చంద్రికకోసం ఉర్రూతలూగే రాజు ఏకపత్నీ వ్రతుడా ?

వ : అంతఃపురములో ఇదివరకే వెలిసిన మహారాణి ముఖచంద్రికల్ని మించిన వెలుగులున్నాయా ?

భే : పాతరోత, కొత్తవింత.

వ : వింతలకోసం విక్రమాదిత్యుడు పాకులాడతాడా ?

భే : చేస్తున్నదదే మహాశయా. వనమాలి చిన్న భార్య చంద్రముఖిమీద మహారాజు మనస్సు లగ్నమైంది, ఆమె చిత్తరువు వ్రాసి రాత్రింబగల్లు దాన్ని ఆరాధిస్తున్నాడు.



http://www.maganti.org/

వ : అగ్నిసాక్షిగా వివాహమాడిన మహారాణి చిత్రం రాజ సభలో సింహాసనానికి పైగా అధిష్టించి స్త్రీ లోకాన్ని గౌరవించి, తన్ని తాను గౌరవించుకుని, ధర్మాసనం అలంకరించే వరూచి శిష్యుడు విక్రమాదిత్య మహారాజు విషయమే చెబుతున్నారా మీరు ? మహా మంత్రీ ఇప్పుడు కర్తవ్యం ఏమిటి ?

మం : ఏముంది స్వామీ, మహారాజు మోహావేశం అప్పుడే దేశం నాలుగు మూలలూ పాకింది. ప్రజలలో అలజడికలిగింది. ఈ చర్య ఇల్లాగే సాగితే అరాజకం ప్రబలిపోతుంది.

వ : మహారాజు స్థితి మహారాణీకి తెలుసునా ?

మం : ధైర్యంచేసి మహారాణికీ సంగతి ఎవరు చెబుతారు ? ఒకవేళ చెప్పినా, మనస్తాపంపడ్డం తప్ప ఆమె ఏం చెయ్యగలదు ?

భ : అహోరాత్రాలు చంద్రముఖీ విగ్రహారాధన చేస్తున్నాడు.

వ : అంతమాత్రానికే గురుపాదులు ఖంగారుపడి ఆగ్రహించకూడదు.

భ : మీ శిష్య వాత్సల్యమే ఇంతకూ కారణం.

వ : ముళ్లకంపమీదపడ్డ వస్త్రంలా రాజుమనస్సు జాగ్రత్తగా ఉపసంహరించుకోవాలి.

మం : అందుకనే గురువరా, తమకు విన్నవించాను. రాజ కార్యాలు మంత్రులు చూసుకుంటారు. మహారాజు ప్రవర్తనశాసించవలసినవారు గురుపాదులు కాదా.

వ : నిజం, మంత్రీ. ప్రధానులు కేవలం సలహాదార్లు. నిరంకుశుడైన రాజు ఆ సలహా తోసెయ్యొచ్చు.

మం : గురుపాదుల మాట ఆజ్ఞ. అది రాజు శిరసావహించి తీరాలి.

వ : పొంగు పాలు నాయనా. విక్రమార్కుడు వయసు కాడు, సౌందర్యపిపాసి, రసికుడు, కవి, చిత్రకారుడు, గాయకుడు. ఇటువంటి లలిత లక్షణపూరితమైన ఆ సుకుమార హృదయంలో ఏమి మహాక్షోభపడుతున్నాడో మనం ఎరుగుదుమా. మన్ని కాదని, తన దార్ని తనువెడితే మనం చేసేది ఏమిటి ? మూర్ఖంవల్ల ఈ పనిజరగదు.

భ : వరూచి మహాశయులు సరీ అంటే క్షణంలో ద్వార బంధం పటాపంచలుచేసి శిష్యుణ్ణి మీ ముందు నిలబెడతాను.

వ : సర్వశాస్త్రపారంగతులైన మీకు నేను చెప్పవలసింది లేదు. మహారాజుని పరాభవించి మనం గెలవలేము. రాజ్యం అతనిది. మనం కేవలం అంగరక్షకులం.

మం : దర్శనమే లేకపోతే చేసేదేమిటి స్వామీ.

వ : అతని సౌభాగ్యమే మన సౌభాగ్యం. రాజాజ్ఞలేనిదే, రాజద్వారం ఛేదించడానికి మనకి అధికారం లేదు. అసలు ఆహ్వానం లేనిదే అంతఃపురంలో అన్యులడుగు పెట్టకూడదు.

భ : మీ మెత్తదనమే ఈ వికారాలన్నిటికీ కారణం. శిష్యుణ్ణి లొంగ దియ్యలేక శిరంగనీతులు చెబుతున్నారు. మీరు చేస్తారా, నన్ను చెయ్యమన్నారా? శీఘ్రంగా చెప్పండి.

వ : మహాశయా. వినండి, వరూచికంఠాన ప్రాణం వున్నంత వరకు మాళ్వ సామ్రాజ్యంలో అవినీతి తలెత్తకూడదు. నువ్వెత్తి పొడిచే వాత్సల్యంతోనే విక్రమార్కుడి మనస్సు వింటిబద్దలా వొంచుతాను చూసుకో.

మంత్రి : తమ సంకల్పబలం మహాత్మా.

వ : ఎవర్రా అక్కడా.

భట్టు : చిత్తం మహాప్రభో.

వ : రాజద్వారం తలుపులు తియ్యమను.

లోపల్నించి : వీల్లేదు.

భట్టు : ఎందుకని ?

లోపల్నించి : రాజాజ్ఞ.

వ : ఎవరు లోపల ?

లోపల్నించి : పరిచారిక భానుమతి.

వ : భానుమతీ నన్నెరుగుదువా ?

లో : నమస్కారం స్వామీ, సేవకురాల్ని క్షమించాలి.

వ : తలుపుతియ్యి క్షమిస్తాను.

లో : అపరాధిని. ఆచార్యా—అటు రాజాజ్ఞ, ఇటు మీరు, నేనేంచేతును.

వ : వెళ్లి మహారాజుతో చెప్పు.

లో : ఏమని మహానుభావా ?

వ : రాజగురువు రాజద్వారం దగ్గిర వోర్షామునించి నిలబడి వున్నారని.



http://www.maganti.org/

లో : చిత్తం మహాప్రభో.

భే : తాటాకు చప్పుళ్లకి కుందేళ్లు బెదుర్తాయా ?

వ : కాలప్రభావంవల్ల మత్తే భాలే హడిలిపోతాయి. కుందేళ్లకో లెఖ్ఖొచ్చిందా.

(గంటల చప్పుడు)

భే : ఏమిటా చప్పుడు ?

మంత్రి : మహారాజు అంతఃపురంలోంచి బయల్దేరాడన్న మాట.

(గంటలు గబగబా చప్పుడు)

భే : వరూచి మహాశయా.

(తలుపులు తీసిన చప్పుడు)

[ఖంగారుగా విక్రమాదిత్యుడు ప్రవేశం.]

విక్ర : గురువరా, తమరా, స్వయంగా ? మహాపరాధిని, గురువరా, ఆజ్ఞాబద్ధుడు, శిష్యుడు మీ పాదధూళి శిరస్సున ధరించి నమస్కరిస్తున్నాడు.

వ : వత్సా ! హృదయ దౌర్బల్య వినాశావాప్తిరస్తు.

వి : మహాత్మా లోపలికి దయచేసి ఆసీనులుకండి, శిష్యుడు పాదసేవచేస్తాడు.

వ : నా పాదాలసంగతి అటుంచి, నీకుడి పాదంమీద ఆరక్తస్రవంతి ఏమిటి ?

వి : గురునాజ్ఞవినివొచ్చే తొందరలో గడప తగిలి గాయం పడింది. ఫరవాలేదు.

వ : గురునాజ్ఞ పరిపాలనలో నీ బాధకూడా తెలియడం లేదా. ఎవరురా, ధన్వంతరిని పిల్చుకురండి. వెంటనే. శిష్యా, వీరందర్నీ చూశావా.

వి : మన్నించాలి, గురుపాదసేవాసక్తిలోనన్ను నేనే మర్చిపోయాను. భేతాళ గురూ, శిష్యుడు నమస్కరిస్తున్నాడు. మంత్రిసత్తమా మహారాజు నమస్కరిస్తున్నాడు.

మం : విజయీభవ.

వి : శిష్యుడి అపరాధం క్షమించాలి. గురుపాదులంతా దీనుడి ద్వారసీమలో నిరీక్షించడానికి కారణం తెలియజేసి నన్ను ధన్యుణ్ణిచెయ్యరా ?

వ : మహారాజా నీకు మనస్వస్థత లేదని విని కనుక్కునేందుకు వొచ్చాం. ఇప్పుడు నీవొంట్లో బాగుందా.

వి : గురువరా, మహారాజైనవాడికి ఆత్మీయ విషయాలుండకూడదా ?

వ : సూర్యభగవానుడికి ఆత్మీయ విషయాలుండి ఒక రోజు దర్శనం ఇవ్వకపోతే మనం ఏమవుతాం.

భే : చంద్రముఖీ పాదసేవాసక్తులమవుతాం !

వ : మహాత్మా ! ఆచార్యత్వం నాకు విడిచిపెట్టారు కదా ?

భే : క్షంతవ్యుడను.

వి : గురువరా, నన్ను వంచన చెయ్యడానికి పిలిపించారా ?

వ : నీకు వంచన నాకు వంచన కాదా ? వత్సా ! నీ గౌరవం కాపాడ్డమే నా కర్తవ్యం. అందుకనే వొచ్చాను.

వి : మరి ఆజ్ఞ.

వ : ఏకాంతసేవ మానేసి, నిర్మలమైన హృదయంతో రాజ్యపాలనా, రాణిపాలనా చెయ్యమని.

వి : గురూ, మళ్లీ నాకు ఆత్మీయమైన సంగతి ప్రస్తావిస్తున్నారు. నా హృదయ వేదనకి కారణం అవుతున్నారు.

వ : ఆ హృదయవేదన అనవసరం. మానెయ్యమని.

వి : తెలియడం లేదు మహాత్మా.

భే : చల్లకొచ్చి ముంతదాచుకోడం ఎందుకు ? మహారాజా నేను చెబుతాను విను. చంద్రముఖీలోలుడవై నువ్వు రాజకార్యాలు నిర్లక్ష్యంచేస్తున్నావు. ఆలోలత్వం మానెయ్యమని చెప్పడానికి, మాళ్వసామ్రాజ్య ప్రజల తరఫున ప్రతినిధులుగావొచ్చి, నిన్ను ఆజ్ఞాపిస్తున్నాం.

వి : గురూత్తమా, మీరు అపోహపడుతున్నారు. విక్రమాదిత్యుడు జారుడుకాడు. తాను వలచిన సుందర్ని అగ్నిసాక్షిగా వివాహంచేసుకో దలచుకున్నాడు. మీ సంశయ నివృత్తి అయిందా ?

వ : పాపము శమించునుగాక.

వి : ఏమన్నారు ?

భే : పాపము శమించునుగాక.

వి : అగ్నిసాక్షిగా వివాహం చేసుకునేందుకు తమ ఆశీర్వచనం లేదా ?

వ : లేదు.

వి : కారణం, శెలవిస్తారా ?

వ : మాళ్వ సామ్రాజ్య సింహాసనం మీద ఇద్దరు రాణులికి చోటులేదు.

వి : కోసలరాజ్య సింహాసనం మీద ముగ్గురు రాణులికి చోటుంటే విశాలమైన మాళ్వసామ్రాజ్య సింహాసనం అంత ఇరుకెందుకు కావాలి మహాత్మా.



http://www.maganti.org/

వ : ముగ్గురి భార్యల్ని చేసుకుని ముప్పతిప్పలూపడ్డ కోసలాధిపతి దశరథుణ్ణి కాకపోతే, అతని కుమారుడు శ్రీరామచంద్రమూర్తిని తల్చుకోకూడదూ ? ఒకమాట ; ఒక పత్ని ; ఒక బాణం.

వి : ఇంత ఏకపత్నివ్రతుడూ, ఇంత ధర్మపరిపాలకుడూ అనుభవించిన సుఖం ఏమిటి ? తండ్రికి దుర్మరణం ; తల్లికి, వైధవ్యం ; భార్యకి వనవాసం ; తనకివియోగం. ఆ అష్టకష్టాలూ నాకెందుకు ప్రాపించాలి.

వ : శ్రీరామచంద్రుడు తనకోసం జీవించలేదు. తన ప్రజలకోసం, నీతికోసం, ధర్మంకోసం జీవించి, ఆ చంద్రతారార్కంగా నిల్చిపోయే ధర్మ ప్రవర్తన ప్రకటించాడు.

వి : తన వివాహంకూడా ఇతరులకోసమే చేసుకున్నాడా ?

వ : స్వవిషయ సమర్థనలో ఆగ్రహంమూలాన్ని, అనుచితమైన భావాలూ, భాషా ప్రకటిస్తున్నావు. వత్సా ! శ్రీరామచంద్రుడికి గురువుల ఆజ్ఞే కర్తవ్యం. విశ్వామిత్రుని ఆజ్ఞగా సీతామహాలక్ష్మిని వివాహం చేసుకున్నాడు. తండ్రి అభీష్టంగా వనవాసంచేశాడు. లోక కల్యాణంకోసం రావణసంహారంచేశాడు. ప్రజల అభిప్రాయబలాన్ని అనుసరించి భార్యావియోగం అనుభవించాడు. అటువంటి నిష్కామ జీవితం, త్యాగ దీక్షా, ఎంతటివారికి శిష్యా. అందుకనే రామరాజ్యం అన్నారు. హరిశ్చంద్ర రాజ్యం, నలరాజ్యం అనలేదు.

భే : రేపు మళ్లీ విక్రమాదిత్య రాజ్యం అనాలి.

మం: భారతీయచరిత్రలో మహారాజ నామధేయం సువర్ణాక్షరాలతో లిఖించాలి.

వి : నేను రాజ్యపరిత్యాగం చెయ్యడమే గురుపాదుల అభీష్టమైతే సర్వసిద్ధంగావున్నాను.

మం : గురువుల అభీష్టం అదికాదు. ఆ అవసరం కలిగించే కారణంలేకుండా చేసుకోమని.

వి : మంత్రీ, వృత్తివల్ల సౌఖ్యుడవు. నావనమాలికున్న స్వేచ్ఛ నాకు లేదా ?

మం : లేదనే గురువులనిర్ణయం మహారాజా.

వి : అటువంటప్పుడు నేను వనమాలినే అవుతాను.

వ : శిష్యా, నీవనం సామ్రాజ్యం, అందులో మొక్కలు ప్రజలు, ఈ వనమాలికీ, ఆ వనమాలికీ సాటిలేదు.

వి : అయితే.......గురువుల ఆజ్ఞ....... ?

వ : అదిగో మాళ్వసామ్రాజ్య సౌభాగ్యలక్ష్మి ఇల్లాగే వొస్తోంది. ఆ ముగ్ధరాలి ముఖంచూసి శపథం చెయ్యి నాయనా, ఇకమీద నీ హృదయంలో......

మహారాణి : గురువరా, ఆర్యపుత్రా నమస్కారం. ఏమిటీ మహాభాగ్యం.

వ : సర్వమంగళ సౌభాగ్యసిద్ధిరస్తు.

వి : ఇకమీద ఇది హృదయంకాదు. నల్లరాయి, అయోమయం. మహారాణీ అపరాధిని క్షమించు. ఆర్యావర్త చక్రవర్తి, మాళ్వసామ్రాజ్యాధిపతి, సాష్టాంగదండ ప్రణామం చేస్తున్నారు. విక్రమాదిత్యుడికమీద తన సామ్రాజ్ఞి చరణచారణ చక్రవర్తి; ప్రజాభీష్టానికి బానిస, లోకకల్యాణ కార్యనిర్వహణంలో నిమిత్త మాత్రుడు— సామ్రాజ్ఞీ! సామ్రాట్ క్షమార్పణ కోరుతున్నాడు.

మ. రా : ఆర్యపుత్రా నేను ఏమి అపరాధంచేశానని, నన్నీ విధంగా పరాభవంచేశారు. గురువరా, ఇందులో మీ దోహదం ఏంతవరకు ?

వ : ముందు నీ పాదపద్మాలమీద వాలిన సామ్రాట్‌కి క్షమాపణ ఇయ్యి తల్లీ.

మ. రా : గురునాజ్ఞ. సామ్రాట్ ! సామ్రాజ్ఞి క్షమించింది. లేవండి.

వ : మహారాజా, ఈ క్షణంలో నీకు అవగతమైన సత్యం, ధర్మం. చిరకాలం పాలించు. నీకంటె, నీ అభీష్టాలకంటె, నీ సౌభాగ్య లక్ష్మి మహారాణీ ఎక్కువ.

మ. రా : గురువరా! సామ్రాట్ నాకు దేవుడు.

మం : సామ్రాట్ మాకు ప్రభువు. జయ్ ! మాళ్వసామ్రాజ్యాధిపతి విక్రమార్క చక్రవర్తికీ జయ్ !

భే : సామ్రాట్‌కంటె, సామ్రాజ్ఞికంటె, ఉభయులికీవుమ్మడి అధికారచిహ్నమైన సింహాసనం గొప్ప.

వ : సింహాసనంకంటెకూడా ప్రజలూ, ప్రజాభీష్టం, ప్రజాసౌఖ్యం ఎక్కువ !

★

Source: A.P. Press Academy Website, Andhra Mahila Magazine – May 1945

Disclaimer: This topic/article/write-up of Sri Kapila Kasipati has been posted here to increase the availability of some rare, forgotten and precious material for appreciation by a wider audience and with no intention what so ever of copy right violation.

Request for removal of any copyrighted material, by the owner, will be promptly complied with.

Maganti Vamsi Mohan